ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సెప్టెంబరు 2013

వెల : రు. 20/-




363

కథలు : డా॥ జి.వి. కృష్ణయ్య, సిహెచ్. మధు

వ్యాసాలు : డా॥ దిలావర్, కె. రాజశేఖర రాజు

సమీక్షలు : చే, ఓ.వి.వి.యస్. రామకృష్ణ

visit us @ www.prajaasaahithi.com

# ప్రజాసాహితి

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 37 సంచిక : 2 **363** సెప్టెంబరు, 2013

గౌరవ సంపాదకుడు
నిర్మలానంద

ప్రధాన సంపాదకుడు
**కొత్తపల్లి రవిబాబు**
సంచారవాణి: 9490196890
ravibabujs@yahoo.co.in

జనసాహితి ప్రధాన కార్యదర్శి చిరునామా:
**దివికుమార్,**
divikumar1949@yahoo.com
8/28, సిమెంటు ఫ్యాక్టరీ పోస్టాఫీసు వెనుక,
లోటస్ ల్యాండ్, కేదారేశ్వరపేట,
విజయవాడ-520 003
ఇల్లు: 0866-2538890 సెల్లు: 9440167891

రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా
**పి. ఎస్. నాగరాజు,**
సంపాదకుడు
7-15-17, న్యూ కాలనీ,
ప్రశాంతి విద్యానికేతన్ ఎదురుగా,
శ్రీకాకుళం-532001,
సంచారవాణి: 9441913829

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 200-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1000-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 400-00 |

చందాలు పంపవలసిన చిరునామా
ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారివీధి
అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం
విజయవాడ-520002
ఫోన్: 9490196890

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

ముఖచిత్రం : పతనంలో రూపాయి
2వ అట్ట : కారల్‌మార్క్స్ కవిత
3వ అట్ట : ప్రకటన
4వ అట్ట : 'మా భూమి' పాటలు

| | | | |
|---|---|---|---|
| సంపాదకీయం-1 | జెండాలు వేరైనా పాలకుల ఎజెండాలొక్కటే | | 3 |
| సంపాదకీయం-2: | పరాధీనతవల్లే రూపాయి పతనం | | 4 |
| కథలు | : పెజాస్వామ్యం | - డా॥జి.వి.కృష్ణయ్య | 13 |
| | : సవాల్ | - సిహెచ్.మధు | 27 |
| గురజాడపై... | : 'దిద్దుబాటు' కథలో మానవ సంబంధాలు | - ఎ.నాగరాజు | 8 |
| సమీక్షలు | : జింబో కవిత్వంపై | - ఓ.వి.వి.యస్.రామకృష్ణ | 17 |
| | : గౌరవం సినిమాపై | - చే | 41 |
| వ్యాసాలు | : మదిలోపల గదిలోపల | - డా॥దిలావర్ | 18 |
| | : కొడవటిగంటి రోహిణీప్రసాద్-సంస్మరణ | - కె.రాజశేఖరరాజు | 10 |
| | : అచ్చమైన ప్రజారచయితలు సుంకర, వాసిరెడ్డి | - కర్నాటి లక్ష్మీనరసయ్య | 35 |
| కవితలు | : నౌగాపు మాధవరావు (7), అగతమూడి మరియదాసు, తక్కోలు మాచిరెడ్డి అనువాదం(9), ఎరుకలపూడి గోపీనాధరావు (22), వల్లభాపురం జనార్ధన(34), కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి(42) | | |
| ధారావాహికలు | : పాశ్చాత్య సాహిత్య పరిచయం-37 - నాలుగు రంగులు రచన : అప్టన్ సింక్లెర్ | అనువాదం: ముక్తవరం పార్థసారథి | 36 |
| | : మానవ సమాజ పరిణామం : 9 | - డా॥ ఆర్కే | 31 |
| బాలసాహితి | : బాలబంధు బి.వి.నరసింహారావు శతజయంతి; బాలబంధు గేయాలు; ఇంకా... వాన అశ్విని, డి.రమణ, పరిమళ, డి.నటరాజ్ కవితలు | | 23-26 |
| గ్రంథాలయాలు-4 | : అన్నమయ్య గ్రంథాలయం-గుంటూరు | | 43 |
| శీర్షికలు | : సాహిత్య పత్రికల ప్రారంభ సంపాదకీయాలు -38 'కవిత' | | 38 |
| | : ముప్ఫైఏళ్ళ క్రితం ప్రజాసాహితి-సెప్టెంబరు 1983 | | 30 |
| | : చైతన్యవాహిని | | 44 |
| | : ఈ పుస్తకాలు అందాయి | | 46 |
| గల్పిక | : రూపాయి రోగం | - శ్రీశైలం నూకాచారి | 39 |
| కరపత్రాలు-కదిలేచరిత్ర | : WHO ARE OUR FRIENDS & WHO ARE OUR ENEMIES | | 6 |
| అక్షరనివాళి | : వాసిరెడ్డి భాస్కరరావు | - సింగంపల్లి అశోక్‌కుమార్ | 48 |
| సంతాపాలు | : దభోల్కర్ హత్య(2), చలసాని వెంకట సుబ్బారావు(40), మాలతీచందూర్(45) | | |

డి.టి.పి., కవర్ కలర్ డిజైన్ : ప్రగతి గ్రాఫిక్స్, విజయవాడ

# సంపాదకీయం-1

# జెండాలు వేరైనా పాలకుల ఎజెండాలొక్కటే!

**ఒకానొక** భౌగోళిక ప్రదేశములో నివసించే ప్రజాసమూహాన్ని "ఒకజాతి" అనటానికి సమష్టి సంస్కృతిలో ప్రతిబింబించే ఆర్థిక జీవనం, మానసిక సామీప్యతలతోపాటు వుండాల్సిన కనీస ప్రాతిపదిక ఏదంటే, వారు నిత్యజీవితంలో మాట్లాడుకునేది ఒకే భాష అయివుండటం. వేల సంవత్సరాల పరిణామక్రమంలోగానీ ఒక మాట్లాడేభాష, ఆ భాషకొక నిర్దుష్టమైన అక్షరలిపి, వాటిద్వారా ఊహలూ, ఆలోచనలూ,హేతు జ్ఞానమూ, సాహిత్యమూ రూపొందలేవు.

మనిషిని మనిషితో కలిపి ఉంచేందుకు మాత్రమే భాష పుట్టింది. విద్యుద్దీపాలు, మోటారుబైక్‌లూ, బాల్‌పాయింట్ పెన్నులూ లేని సమాజం నేటి విద్యార్థులకు తెలియకపోవచ్చు కానీ వారి తాతల తరానికి తెలుసు. ఇవన్నీ మనకు సమకూరి వందేళ్ళు కూడా కాలేదు. కానీ భాషలేని సమాజం ఎలా వుండేది? ఎన్నివందల తరాలు వెనుకకు వెళ్ళి ఆలోచిస్తే మనకు అర్థమవుతుంది? మనుషులు జంతుదశనుండి విడగొట్టుకోవటంలో మానవాభివృద్ధి క్రమానికి తోడ్పడిన అతిముఖ్య సామాజిక శక్తి భాష! అది తరతరాల వారసత్వ సంపద. గాలి, నీరు, ఆహారంలాంటి ప్రాకృతిక అవసరాల తరవాత నిత్యజీవితావసరంగా రూపొందినది భాష. అది నాటికీ నేటికీ, ఎవరికీ పుట్టుకతో సంక్రమించదు. భాషను ఎవరికి వారు వ్యక్తులుగా పెనుగులాడి, వెదుకులాడి సాధించలేరు. తల్లే తొలి గురువుగా ఒక జాతి(సమాజం) తన ప్రతిబిడ్డకూ అందించే, నిరంతరం పదునుదేర్చే ఆయుధం భాష. దీనికి మనుషుల్నికలిపే లక్షణమే వుందిగానీ విడగొట్టే స్వభావం లేదు.

అయితే భాష ఒక్కటే ఒక జాతి ప్రజలను కలిపి వుంచలేదని గడిచిన 70-80 ఏళ్ళ తెలుగుజాతి చరిత్ర రుజువు పరుస్తోంది. కలసి జీవించలేమని కొందరు చెప్పేది కూడా ఒకే ఉమ్మడి భాషద్వారానే. ఆలోచనలు-ఆవేశాలూ; ఉత్సాహాలు-ఉద్రేకాలూ; కలివిడిగా జీవించాలో విడివిడిగా సాగించాలో ఇతరులకు తెలిసేట్లు ఒకరికొకరు వ్యక్తంచేసుకునే, సంభాషించుకునే ఏకైకరూపం-భాష. తల్లీ బిడ్డలకూ, అన్నదమ్ములకే కాదు యజమానికీ పనివార్లకూ కూడా ఒకే భాష కావాలి.

ముందొచ్చిన చెవులకన్న వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు భాష తర్వాత బలమైన సామాజిక శక్తులుగా రూపొందిన ఆర్థికశక్తి దాన్ని రక్షించే రాజ్యం ఒక జాతి జీవనాన్ని శాసించగల స్థాయికి ఎదిగాయి. జాతిజీవనంపై పెత్తనం చెలాయించే ఆర్థిక-రాజకీయశక్తుల స్వప్రయోజనాల కుమ్ములాటలకు లోబడే ఒకజాతి-ప్రస్తుత సందర్భంలో తెలుగుజాతి-పరిణామాలను అర్థంచేసుకోవాల్సి వుంటుంది. 1969 నాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమమూ, 1972-73 నాటి ప్రత్యేకాంధ్రా ఉద్యమమూ ఒక సంవత్సరకాలంలో సర్దుబాటుకాగా ప్రస్తుత కాలపు ఉద్యమం పుష్కరకాలంపైగా సాగుతోంది. నేటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమ ప్రారంభకాలానికి రాష్ట్రంలో (చంద్రబాబు) తెలుగుదేశ ప్రభుత్వమూ, కేంద్రంలో భారతీయ జనతాపార్టీ నాయకత్వానగల ఎన్.డి.ఎ. ప్రభుత్వమూ అధికారాల్లో వున్నాయి. ఈ రెండు ప్రభుత్వాలూ, వీటికి ముందూ, తర్వాత అధికారంలోకొచ్చిన కాంగ్రేసు ప్రభుత్వాలూ అమెరికా సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యపు వ్యూహానికి లోబడిన ఆర్థిక-పారిశ్రామిక విధానాలను, ప్రపంచబ్యాంకు ఆదేశాలను అమలుపరచటంలో భాగంగా సమస్త సామాజిక ఆస్తులను ప్రైవేటు సంస్థలకూ, వ్యక్తులకూ దఖలుపడే విధానాలను అవలంబించారు. ప్రజల సంపదలైన భూమి, ఖనిజాలు, అడవి, నీరు, పరిశ్రమలు, చమురూ, గ్యాసుతోసహా ప్రభుత్వరంగ సంస్థలు, విద్యా, వైద్యంలాంటి సేవారంగాలను ఒకటొకటిగా "వ్యక్తిగతం" కింద మార్చే ప్రక్రియను తీవ్రతరమూ, వేగవంతమూ గావించారు. ఈలాంటి ప్రక్రియకు ప్రయోగశాలగా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచబ్యాంకు దత్తత తీసుకొంది. ఈ విచ్చలవిడి బహిరంగలూటీ యొక్క సామాజిక విషఫలితాలు వాటి పర్యవసానాలు ఎలా వుంటాయో కూడా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులకు తెలుసు. రైతులు, కూలీలు, కార్మికులు, చేతివృత్తులవారు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, వెనకబడిన ప్రాంతాలు, క్రూరమైన ఆటవిక మార్కెట్ పోటీలో వెనుకబడిన సమస్త వర్గాలు...వాటిని సహించరనీ, ఆందోళన చెందుతారనీ, బజార్లల్లోకి వస్తారనీ, పోరాటాలు చేస్తారనీ వారికి స్పష్టంగా తెలుసు. ప్రజల ఆందోళనలను క్రూరంగా అణచివేసే పరిస్థితి ఏర్పడకముందే ప్రజల నడుమగల ప్రాంతీయ అంతరాలను అసమానత్వాలను, సాంఘిక వ్యత్యాసాలను మత విశ్వాసాలను రెచ్చగొట్టి అణచివేతకూ, దోపిడీకి, పీడనకూ గురయ్యే ప్రజానీకాన్ని చీలికలు, పీలికలుగావించే వ్యూహాత్మక "ఆధునికానంతరవాద" పథకం కూడా వారి దగ్గర వుంది. మనకున్న అపార వనరులతో వ్యవసాయక, పారిశ్రామిక రంగాలలో బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించగల సమర్థవంతమైన మానవ శక్తులున్న జాతి మనది, కాలంచెల్లిన భూస్వామ్య వ్యవస్థనుండి దీనిని బయటపడనీయక సామ్రాజ్యవాదపు దోపిడీకి నిలయంగా మార్చిన వాళ్ళే ప్రాంతీయ అసమానతలనూ, నిరుద్యోగాన్నీ, అధిక ధరలనూ, అవినీతినీ, అజ్ఞానాన్నీ, పేదరికాన్నీ పెంచిపోషించినవారే, అవన్నీ పెరగటానికి కారకులైన పాలక ముఠాలే, గత 12 ఏళ్ళుగా సమైక్య-ప్రత్యేక నాటకాలాడుతున్నాయి. పైన పేర్కొన్న ప్రజల సమస్యలకు మూలకారణమైన దోపిడీ వ్యవస్థ మూలాలను అర్థంకానివ్వకుండా కుళ్ళి కంపుకొడుతున్న వ్యవస్థలో విప్లవాత్మక మార్పుల ఆవశ్యకతను బాధిత ప్రజానీకపు గ్రహింపుకు రానివ్వకుండా చేస్తున్నారు. నేటి తెలుగు సమాజంలోని నూటికి 90 మందిగాగల పేద, మధ్యతరగతి జీవులను నిత్య అభద్రతలోకి నెట్టిన పాలకవర్గాలూ లేక వారికి ప్రాతినిధ్యం వహించే వివిధ రాజకీయ ముఠాలూ, ఇదే వ్యవస్థను , ఇదే దోపిడీని, పెత్తనాన్ని సమైక్యంగా

కొనసాగిస్తే ప్రజల జీవితాలు బాగుంటాయని ఒకరూ, కాదు ప్రత్యేకమైతే చాలు అంగలుపంగలుగా వికసిస్తాయనీ మరొకరూ మాట్లాడుతున్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంపై ఆధిపత్యంలో వున్న వర్గాలూ, సమైక్య రాష్ట్రంలో వీరితో అధికార పోటీపడలేక విడివడిన ప్రదేశంపై ఆధిపత్యాన్ని కోరుకుంటున్న వర్గాలూ...రాష్ట్ర స్థాయిలో సంఘర్షణ పడుతుంటే, వీరిని అడ్డంపెట్టుకుని కేంద్రంలో అధికారానికి అర్రులు చాచే వర్గాలు తమచేత పగ్గాలు పట్టుకుని విభజన క్రీడను పన్నెండేళ్ళుగా ఆడిస్తూ వస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణా సమస్యను గడచిన 12 సంవత్సరాలుగా పరిష్కరించకుండా ఏ వ్యూహాత్మక కుట్రలతో సాగదీస్తున్నారో, ఈ సమైక్య-ప్రత్యేక ఉద్యమాలచాటున పుష్కర కాలంలో రాష్ట్రంలోని సమస్త సంపదలనూ అటు బహుళజాతి కంపెనీలూ, ఇటు స్థానిక బడాసంపన్నవర్గాలూ అదేసమయంలో రాజకీయాధిపత్య శక్తులూ సులువుగా లక్షల కోట్ల రూ.లు దోచుకోవటానికి దారులు చేసుకున్నారో అర్థమయితేగానీ పాలకముఠాల రాజకీయ కుమ్ములాటల సారాంశం అర్థంకాదు. ఈ 12 ఏళ్ళలో వేలాది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు; లక్షలాది ఆదివాసీలు, గ్రామీణులు వలసల పాలయ్యారు; ఇంజనీర్లుతో సహా లక్షలమంది విద్యార్థులు నిరుద్యోగులై వీధుల పాలవుతున్నారు, అధిక ధరలతో కోట్లాది జనం అల్లాడి పోతున్నారు. వీటన్నిటియొక్క దుష్ఫలితాలూ, భారాలూ, సాధారణ అట్టడుగు ప్రజానీకంపైబడిన ఫలితంగా వారు ఎంతగా విలవిల్లాడు తున్నారో అర్థమయితేగానీ, నేటి ఇదే దోపిడీ వ్యవస్థను సమైక్యంగా గానీ, ప్రత్యేకంగాగానీ నిరాటంకంగా కొనసాగించుకునే దుష్టపథకాలను మనం గ్రహించలేము.

సమైక్య రాష్ట్రంలో ప్రజలనుభవిస్తూ వస్తున్న దుర్భరమైన చేదుజీవితాలకు గల మూలకారణాలను తొలగించకుండా, ఇదే కుళ్ళిన వ్యవస్థను ప్రత్యేకంగా కొనసాగించే వాదాలను రచయితలు భుజానమోయనక్కరలేదు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలలో ఒకటి-తెలుగు భాషను నేటి తరాలకు కూటికీ గుడ్డకూ పనికిరానిదిగా తయారు చేయటం! అటూ ఇంగ్లీషూ ఇటు తెలుగూ రాని రెంటికి చెడ్డరేవళ్ళను ఉత్పత్తిచేస్తున్నది ఈ దళారీ నయవంచక పాలకులే. సామ్రాజ్యవాద శక్తులకు అడుగులకు మడుగులొత్తే కేంద్ర పరిపాలకులకు జోహుకుంలు పలికే రాష్ట్రపాలక ముఠాలలో ఏ ఒక్కటి కూడా అటు సమైక్య రాష్ట్రంలోగానీ, ఇటు ప్రత్యేక తెలంగాణాలో గానీ ప్రజలకు వారివారి మాతృభాషలైన తెలుగు, ఉర్దూలలోనే విద్యను గరపుతామనే కనీస హామీని కూడా యివ్వటంలేదు. ఆ మాటంటే తెలుగులో చదువుకు కొలువులు రావని సమాధానం. మరి ఆ కొలువులకోసమేగా హైదరాబాదు చుట్టూ ఉద్యమాల్ని నడుపుతోంది. ఆ కొలువులు లేకపోవటానికి సమైక్య రాష్ట్రంగా ఉండటమే కారణమని కొందరూ, ఆ కొలువుల కోసమే హైదరాబాదులోనే సమస్తం వుందనే భ్రమలపైన (అక్కడా ఉద్యోగాలు లేవనే నిజం చెప్పకుండా) ఉద్యమాలను మరికొందరూ రెండువైపులా నడిపిస్తున్నారు.

అలిశెట్టి ప్రభాకర్ చెప్పినట్టు "గొంతులో కేన్సర్, కడుపులో అల్సర్, కిడ్నీలో స్టోన్స్...ఈ సమాజ దేహానికి శస్త్రచికిత్స" తప్ప మరొక దారిలేదు. సామ్రాజ్యవాదుల కబంధహస్తాలనుండి ఢిల్లీ పాదుషాల కర్రపెత్తనం నుండి విముక్తమై నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకుంటే తప్ప నిజమైన అర్థంలో మన భాషద్వారా మన జాతి జనుల సర్వతోముఖ వికాసానికి అడ్డంకులు లేని తెలుగు జాతీయ సమాజనిర్మాణం సంఘటితం కాదు. ఈలోగా ప్రజలమధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, వారి నడుమ శాశ్వతమైన గండిని పెంచాలని కుట్రలుచేసే పాలకముఠాల స్వార్థప్రయోజనాల వలలో చిక్కుకోకుండా ప్రజలను అప్రమత్తులుగా వుంచటం రచయితల, మేధావుల కనీస కర్తవ్యం.✤

# సంపాదకీయం-2 పరాధీనత వల్లే రూపాయి పతనం

**ఒక్క** అమెరికా డాలరుతో... 65కు కృశించిన రూపాయి మారకం విలువ
కుప్పకూలిన స్టాక్ మార్కెట్టు
తరిగిపోతున్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు
2014 మార్చి నాటికి తీర్చాల్సిన విదేశీ అప్పు 17200 కోట్ల డాలర్లు!
అనగా పదకొండు లక్షల పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు
దివాళా స్థాయికి చేరిన 30 అతిపెద్ద భారత కంపెనీలు
విదేశీ పెట్టుబడుల రాకే శరణ్యం... ఇటీవల పత్రికల వార్తలివి!

దేశంలో వ్యవసాయరంగం స్థంభించిపోయింది. వస్తుతయారీ పరిశ్రమల రంగం కునారిల్లుతున్నది. విదేశాలనుండి వచ్చే పనిపై ఆధారపడ్డ సాఫ్టువేర్‌రంగం నుండి ఆదాయం తగ్గుతున్నది. సంపదల సృష్టి జరగకుండా ద్రవ్య చెలామణి పెరగటంతో రూపాయి విలువ దేశంలోతగ్గి ద్రవ్యోల్బణంగా, ధరల పెరుగుదలగా వ్యక్తమౌతున్నది.

60 ఏళ్లనుండి ప్రాథమికరంగం (వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తులు, ఖనిజాలు) ఎగుమతులమీద ఆధారపడుతున్నాము. వస్తుతయారీ రంగ పరిశ్రమల ఉత్పత్తులు కొంత ఆదుకొంటూండేవి, కాగా ప్రభుత్వ విధానాలతో అవి కృశించి, వాటి ఎగుమతులూ తగ్గాయి. విచక్షణారహిత దిగుమతులు(యాపిల్సు, సౌందర్య సాధనాలు, చాక్లెట్లు, తాళాలూ, గడియారాలవంటి మనం తయారు చేయగలిగినవీ... ఇంకా, మనం మన యంత్రాలు, యంత్ర పరికరాలతో తయారుచెయ్యగలిగినా విదేశీ పెట్టుబడి తనతోపాటు షరతులతో తీసుకొచ్చే పెట్టుబడి సరుకులు) నానాటికి పెరిగి పోతున్నాయి. దీనితో విదేశీ వాణిజ్యలోటు పెరిగిపోతున్నది. ఈ లోటును ఇన్నాళ్లూ కడుపుచేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారత శ్రామికులు పంపుతున్న డబ్బుతో తీర్చగలిగేవారు.

2008 నాటి సంక్షోభంతో అమెరికా వడ్డీలేని రుణాలను పెంచటంతో డాలర్లు అప్పుతీసుకుని భారతదేశంలో అధిక వడ్డీకి స్టాకు మార్కెట్టు, రియల్ ఎస్టేటుల్లో మదుపు పెట్టిన అంతర్జాతీయ ద్రవ్యజూదరులు; ఇప్పుడు అమెరికా వడ్డీరేట్లు పెంచటానికి పూనుకోవటంతో, తమ ద్రవ్యాన్ని వెనక్కి తీసు కుంటున్నారు. దీనితో రూపాయి మారకం విలువ పతనమై మనం చెల్లించాల్సిన అప్పు తడిసి మోపెడై భరించలేని స్థాయికి చేరింది. విదేశీ పెట్టుబడులు వస్తున్నాయంటూ చంకలు గుద్దుకున్న పాలకులు, వాటిని వాటాలేసుకుని పంచుకునే పథకాలకోసం ఎదురుచూస్తున్న సంపన్న ముఠాలూ అవి తరలిపోవటంతో బిక్క మొహం వేశారు.

అమెరికా, యూరోపు సామ్రాజ్యవాద దేశాలు వడ్డీలు తగ్గించటంతో భారత్ ఎడాపెడా విదేశీ అప్పులు చేసింది. భారత్ అంటే భారత ప్రభుత్వమే కాదు. భారత బడాబూర్జువా వర్గం కూడా చేసింది. 2014 మార్చి నాటికి దేశం చెల్లించవలసిన స్వల్పకాలిక విదేశీరుణం 17200కోట్ల డాలర్లు. దీనిలో 13400 కోట్ల డాలర్లు (78శాతం)భారత్‌లోని వంద పెద్దకంపెనీలు చేసినవే. బొంబాయి స్టాక్ ఎక్స్‌చేంజి ప్రకారం అతిపెద్ద వంద కంపెనీలివి. ఈ వంద కంపెనీలే భారతదేశంలోని బ్యాంకులిచ్చిన మొత్తం రుణాలలో 70శాతం పొందాయి. ఫలితం వీటిలో 30 కంపెనీలు దివాళాతీసే స్థితికి చేరాయి.

పెరుగుతున్న విదేశీ వాణిజ్యలోటుతోపాటు, తిరిగి చెల్లించాల్సిన విదేశీ రుణభారంవల్ల రూపాయికి విలువలేకుండా చేశారు. 1966లో రూపాయిలో 37వంతుల విలువను ఇందిరాగాంధీ ప్రధాని అయిన కొత్తల్లో కోతపెట్టినపుడూ, 1991లో విదేశీ వాణిజ్యంలో చెల్లింపుల లోటు అనే పేరుతో డంకెల్ ప్రతిపాదనలపై పి.వి.నరసింహారావు ప్రభుత్వం సంతకం పెట్టినపుడూ జరిగింది ఇదే. దేశ ఆర్థిక వ్యవస్థను స్వంతకాళ్లపై నిలబెట్టే ప్రయత్నం చేయకుండా విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, దానిద్వారా సంక్షోభంనుండి తాత్కాలికంగా బయటపడే విధానం ఆనాడు అనుసరించారు. ఇప్పుడూ అవే పద్ధతుల్ని పాటిస్తున్నారు.

జనవరిలోనే అమెరికా వెళ్లిన చిదంబరం విదేశీ పెట్టుబడులపై ఆంక్షలను పూర్తిగా ఎత్తివెయ్యటమే యుపిఏ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ప్రకటించాడంటే ఇప్పుడు కమ్ముకొచ్చిన సంక్షోభం గురించి ఆనాటికే అతనికి తెలుసు. ఆ ప్రకటన కనుగుణంగానే, ఆయుధాల తయారీ నుండీ టెలికాం వరకూ, ఇంకా... బ్యాంకులు, బీమా, పెన్షను నిధులు, చివరకు కిరాణా వ్యాపారంవరకు విదేశీ పెట్టుబడిపై ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎత్తివేశారు. దీనితో విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని ఆశపడుతున్నారుగానీ దేశం పరాధీనతమై పోతుందన్నది పట్టలేదు. ఇది దేశద్రోహం తప్ప మరొకటి కాదు.

పత్రిక తెరిస్తే అమ్ముడైపోతున్న పరిశ్రమలే! చూడబోతే అన్నీ దేశంలో పేరు ప్రఖ్యాతులున్నవే. రెడ్డిల్యాబ్స్‌వంటి మందుల కంపెనీలు మహా సిమెంటు తయారీ కంపెనీ, అనేక విద్యుత్తు కర్మాగారాలూ, చిన్న జలవిద్యుత్తు డ్యాములవరకూ ఒకటొకటిగా విదేశీ కంపెనీల పరమౌతున్నాయి. విజయవాడ – హైద్రాబాదురోడ్డు నిర్మించిన జియంఆర్ కంపెనీ ఈ రోడ్డులో వాటాలు అమ్మకానికి పెట్టింది. ఇహ కొనగలిగింది ఎవరు? విదేశీ పెట్టుబడే!!

నానాటికీ దిగుమతులు విపరీతంగా పెరుగుతూ, మనదేశంనుండి ఇనుప ఖనిజం బాక్సైట్‌లాంటి ప్రాథమిక ఎగుమతులు పెరిగినా విదేశీ వాణిజ్యలోటు ఇంకా ఇంకా పెరిగిపోతోంది. 60 రోజులకు అనగా రెండు నెలలకు మాత్రమే బొటాబొటిగా సరిపోయే స్థాయికి విదేశీ మారకద్రవ్య నిల్వలు హరించుకుపోతున్నాయి.

నేటి రూపాయి విలువ పతనానికీ, ధరలు సామాన్యుడికి అందనంత స్థాయిలో చుక్కలలో నిక్కటానికీగల పరాధీన ఆర్థిక–రాజకీయ విధానాల గురించి మాట్లాడకుండా అధికార పీఠాలనలంకరించిన వ్యక్తులదే (ఉదా॥మన్‌మోహన్‌సింగ్, చిదంబరంలదే) కారణమన్నట్లు ఆరోపిస్తూ తానైతే వాటిని సరిదిద్ది పారవేయగలనని నరేంద్రమోడీ ప్రగల్భాలు పలుకుతున్నాడు (25–8–2013 నాటి పత్రికలు చూడండి). భా.జ.పా. నాయకుడు వాజపేయి దేశ ప్రధానిగా ఉన్న కాలంలో అనుసరించినవి యివే విధానాలని ప్రజలు మరిచిపోయారనుకుంటున్నాడు. అవి అలావుండగా ఈ పరాధీన ఆర్థిక–రాజకీయ విధానాల దుష్ఫలితాలు సంస్కృతిని కూడా తీవ్రంగా అల్లకల్లోలం గావిస్తున్న సంగతిని మనం ప్రత్యేకంగా గమనంలో వుంచుకోవాలి.

"వ్యక్తుల దుర్భావాల వల్లనే సంఘం అధోగతిలో వుందనీ అదిమారితే ఇదీ మారుతుందనీ ఈ నాడెవరూ భావించనవసరంలేదు. ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మనఃప్రవృత్తు లుంటాయనేది సులభంగా గ్రహించవచ్చు" అని కొడవటిగంటి కుటుంబరావుగారు ఏనాడో చెప్పిన శాస్త్రీయమైన విశ్లేషణతో మనం భారత సమాజాన్ని లోతుగా చూస్తే ఈ పతన పరాధీన ఆర్థిక–దళారీ రాజకీయ చోదకశక్తుల బారినపడిన ప్రజల సాంస్కృతిక జీవితం విచ్ఛిన్నానికి గురవుతోందని తేలికగా గ్రహించగలం. 'వ్యక్తి' సామాజిక విలువల్ని భయంకరంగా కోల్పోతున్నాడు. పరాయీకరణ చెందిన ప్రతిచోటా–లోలోపల తనని తాను ధ్వంసంచేసుకుంటూ సమష్టి శ్రమ సంస్కృతీ విలువల్ని రద్దుచేసుకుంటున్నాడు. ఈజీమనీ పొంగిపొర్లడంతో స్వసుఖవాదియై, వ్యక్తివాద పోకడలతో తాను సృజించిన డబ్బుకి తానే బానిసై పోతున్నాడు. వ్యవసాయ సంస్కృతిని దిగమింగిన హరిత విప్లవం, ప్రపంచీకరణ కోతలతో స్థిరజీవన సాంస్కృతిక విలువల్ని రద్దుచేసిన అర్థవలసపాలన మనిషిని నిలకడలేని వలసపక్షిగా మార్చేస్తోంది. గ్రామీణ జీవనచిత్రపటం చిరిగిపోయి పట్టణాల ఆర్భాటపు బలుపు జోరందుకుంది. అసమ అభివృద్ధి కల్లోలం ఋణార్థిక భేషజాల్ని వ్యాప్తిచేస్తోంది.

కొద్దిమంది గుప్పెటలో అపారమైన సంపదల మేట ఒకవైపు –అమాయకమైన కోట్లాదిమందిలో ఆకలి, అనారోగ్యం, అభద్రత, అవిద్య మరోవైపు–వెరసి సామాజిక సమతుల్యతను దెబ్బతీస్తోంది. కుటుంబ సంబంధాలు కల్లోలమవుతున్నాయి. వైవాహిక సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. సామాజిక మానవ సంబంధాలు విధ్వంస మవుతున్నాయి. యాంత్రికమైన చలనవేగం శ్రమవిలువల్ని లుప్తం చేస్తున్నాయి. పొరలు పొరలుగా పేరుకుపోయిన పతన విలువల విషసాంస్కృతిక సంబంధాలు ఉక్కపోతకు గురిచేస్తూ మానవ పరిణామక్రమంలోని వికాసాన్నీ సమష్టిశక్తినీ భ్రష్టుపట్టిస్తున్నాయి.

ఈలాంటి విధ్వంసక సంస్కృతికి మూలమైన వ్యవస్థీకృత పరాధీన, ఆర్థిక రాజకీయాల ప్రభావాన్నుండి భావజాలపరంగా ప్రజల్ని బయటపడవేయాల్సిన చారిత్రక సాంస్కృతిక కర్తవ్యం నేటి రచయితలూ మేధావులపై ఉంది. అందుకు సంసిద్ధులమవటమే యిక మిగిలి వుంది..

✤

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2096**

* * *

**Read other issues of Praja Sahiti Magazine@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=58**